క్లుప్తంగా

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహేశ్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో గోలివాడ, విలేజీ అంతర్గాం, టీటీఎస్ అంతర్గాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు 2016లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ బాధిత కుటుంబాలతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇంతకుముందు కేటాయించిన లబ్ధిదారులకు కేటాయించిన అనంతరం మిగతా వారికి డ్రా తీసి ఎంపిక చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోదావరిఖనిటౌన్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని సోమవారం ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సోమారపు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం బీజేపీ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణకు వినపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సామేలు, నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్, ఎమ్మార్పీఎస్ కన్వీనర్ గుండ్ల రాకేశ్, అధికార ప్రతినిధి కాసిపేట రాజయ్య నాయకులు కాంపెల్లి శ్రీనివాస్, బాపు, ఏలూరి రాంబాబు, మొగిలి, సల్లూరి జయరాజ్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు



ఒప్పందపత్రం అందుకుంటున్న ప్రిన్సిపాల్

పెద్దపల్లిరూరల్: యువతకు సరైన ఉపాధి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళాలను నిర్వహించి పేరొందిన మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. సోమవారం కాలేజీ ఆవరణలో మ్యాజిక్‌బస్ ఇండియా అనే సంస్థతో కళాశాల ఒప్పందం చేసుకుందని వివరించారు. విద్యావంతులైన యువతకు ఉద్యోగ సాధనలో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించి ఉద్యోగసాధనకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి రేల్ల సంజీవ్, తిరుపతి, అశోక్, శివ, భవాని తదితరులు పాల్గొన్నారు.

భూములకు సరిహద్దులు ఏర్పాటు చేయాలని వినతి

పాలకుర్తి: మండలంలోని బామ్లా నాయక్‌తండా గ్రామస్తులకు సాగు నిమిత్తం సర్వేనెంబర్ 111 లో కేటాయించిన భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం బామ్లానాయక్ తండా గ్రామస్తులు జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణను కలిసి విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా రాత పూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామానికి చెందిన 66 మందికి ఒక్కొక్కరికి 24 గుంటల చొప్పున ప్రభుత్వ భూమిని కేటాయించారని, అయితే వాటికి హద్దులు లేని కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ మేరకు సంబంధిత లబ్ధిదారులకు హద్దులు నిర్ణయించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

టాస్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ, పీజీ కాలేజీలో సోమవారం విద్యార్థులకు టాస్క్ ట్రైనర్ నిశాంత్‌కుమార్ అప్టిట్యూడ్, రీజనింగ్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతిక అంశాలతో పాటు ఎంట్రన్స్ పరీక్షలకు ఉపయోగపడేలా మేధస్సును పెంచుకోవాలని గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో టాస్క్ ప్రోగ్రాం అధికారి కుమార్, ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు!

- అధికారుల తీరుపై మండల సభలో ఆగ్రహం
- ఇష్టానుసారంగా మిడిల్ పోల్స్
- పట్టించుకోని అధికారులు



కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద విద్యుత్ తీగలు

కమాన్‌పూర్: మండల పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పేరుకుపోతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండలంలోని ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారులు, గ్రామాల్లో, పంట పొలాల్లో ప్రజలకు అందే ఎత్తుల్లో ఉండి ప్రమాదకరంగా మారాయి. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు..

మండల పరిధిలోని కమాన్‌పూర్, రొంపికుంట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది గ్రామపంచాయతీలున్నాయి. గుండారం రైతు వేదికకు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద విద్యుత్ తీగలు కిందికి ఉండంతో రహదారి వెంట వెళ్లే భారీ వాహనాలతో ఎప్పుడు ఏలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల్లో చేతికందే ఎత్తులో ఉన్న మిడిల్ పోల్స్ వేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఇష్టారీతిగా మిడిల్ పోల్స్ ఏర్పాటు

మండల పరిధిలోని విద్యుత్ సమస్యలున్న వాటిని పరిష్కరించడానికి సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ పోల్స్ విరిగినా, లేదా విద్యుత్ తీగలు కిందికి ఉన్నా.. అక్కడ మిడిల్ పోల్స్ ఏర్పాటు చేసి తీగలు సరిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్లు మాత్రం ప్రమాదం లేని దగ్గర మిడిల్స్ పోల్స్ వేస్తూ ప్రమాదకరంగా ఉన్న చోట పోల్స్ వేయకుండా వేసినట్లు బిల్లులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.మండల పరిధిలో విద్యుత్ సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించడం లేదని సర్పంచ్‌లు ఎన్నోసార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించడం లేదని సర్పంచులు వాపోతున్నారు.



చేతికి అందే ఎత్తులో కిందికి వేలాడుతున్న 11కేవీ విద్యుత్ తీగలు

చేతికందే ఎత్తులో ఉన్నాయి



మా ఇంటి వెనుకాల 11కేవీ లైన్ ఉంది. ఇటీవల కాలంలో పాత ఇనుప స్తంభాలను తీసివేసి కొత్త స్తంభాలు వేశారు. ఇల్లు కట్టుకునే భూమిలో కాకుండా దారి పక్కన పోలు వేయాలని కోరినా ఇప్పటి వరకు వేయలేదు. వాహనాలు పెట్టుకునేందుకు కిందికి ఉన్న విద్యుత్ తీగలతో భయపడుతున్నాం.
– బాలసాని రవి

అధికారులు పట్టించుకోవడం లేదు



గుండారంలో విద్యుత్ సమస్యలు చాలా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ఎన్నోసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటి వరకు పట్టించుకోవడం లేదు, ఇష్టారీతిగా మిడిల్ పోల్స్ వేస్తున్నా.. వాటి సమాచారం కూడా మాకు ఇవ్వడం లేదు.
– ఆకుల ఓదెలు, సర్పంచ్, గుండారం

సమస్యలు గుర్తించి త్వరలో పరిష్కరిస్తాం

కమాన్‌పూర్ మండల పరిధిలో విద్యుత్ సమస్యలున్నాయని మా దృష్టికి వచ్చింది. కొద్ది రోజులు సిబ్బందితో సమస్యలను గుర్తించి వా టిని పరిష్కరిస్తాం. ప్రమాదం ఉన్న చోట మిడిల్ పోల్స్ వేయిస్తాం.
– రాజేంద్రకుమార్, ఏఈ, కమాన్‌పూర్

వీధులు ఊడ్చి కార్పొరేటర్ నిరసన



చెత్త ఊడుస్తున్న కార్పొరేటర్ సుమలత

కోల్‌సిటీ: తన డివిజన్‌లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం లేదని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత సోమవారం తన డివిజన్‌లో రోడ్డు ఊడ్చుతూ నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ డివిజన్‌కు ఎనిమిది మంది పారిశుధ్య సిబ్బంది రోడ్లు, డ్రైయినేజీ, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు కార్మికులు శుభ్రం చేయాలని, గత ఆరు నెలలుగా ఒకే ఒక్క పారిశుధ్య కార్మికుడు డివిజన్ పరిధిలో మొక్కుబడిగా విధులు నిర్వహిస్తుండడంతో చెత్తాచెదారం పేరుకుపోయిందని అన్నారు. దీనిపై శానిటరీ అధికారి, కమిషనర్‌కు పలుమార్లు సమస్యను వివరించినప్పటికీ, అమలుకు మాత్రం నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారులు శాశ్వతంగా పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు.

బాధ్యతలు స్వీకరణ

ఓదెల: పంచాయతీ రాజ్ శాఖ మండల ఏఈఈగా సమ్మిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులను సక్రమంగా నిర్వర్తించటం లేదని జిల్లా కలెక్టర్ సంగీతసత్యనారాయణ సస్పెన్షన్ విధించారు. తిరిగి ఏఈఈగా బాధ్యతలు స్వీకరించటంతో ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

దళితుల అభ్యున్నతికే 'దళితబంధు'

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

రామగుండం: సీఎం కేసీఆర్ దళితుల అభ్యున్నతికే దళితబంధు పథకం తీసుకువచ్చారని, అసమానతలను రూపుమాపి, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహ దాత ఆరుముళ్ల శ్రీనివాస్ దంపతులను సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు ఆముల నారాయణ, కందుల సంధ్యారాణి, కార్పొరేటర్లు, బీజేపీ నాయకుడు సోమారపు అరుణ్‌కుమార్, అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు కల్వల శ్రీనివాస్, దుర్గాప్రసాద్, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి కృషి

గోదావరిఖని: మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ సహకారంతో మున్సిపల్ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. అంతర్గాం మండలం మద్దిర్యాల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్‌తో పలువురు నాయకులు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, రిక్షా కార్మిక సంఘం అధ్యక్షులు నడిపల్లి మురళీధర్‌రావు, గౌరవ అధ్యక్షులు తానిపర్తి గోపాల్‌రావు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

భావితరాలు ఆరోగ్యంగా ఉండాలి

గోదావరిఖనిటౌన్: సోమవారం 35వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొని మాట్లాడారు.భావితరాలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ గర్భిణీ స్త్రీలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో అధికారులు అనిల్, రావూఫ్‌ఖాన్, పుష్పలత, డాక్టర్ నవ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి పాలకమండలి సభ్యులు, అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు. రూ. 5.85 కోట్ల వ్యయ అంచనాలతో చేపట్టిన మున్సిపల్ కార్యాలయ భవనంలో అన్ని వసతులు ఉండేలా ప్రణాళికలను రూపొందించి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. భవిష్యత్ తరాలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వీలుగా పనులు చేపట్టేందుకే ఆర్‌అండ్‌బీ కార్యాలయం, జిల్లా గ్రంథాలయాన్ని తరలించినట్లు వివరించారు. కొత్త భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శివప్రసాద్, ఈఈ సంపత్‌రావు, ఏఈ సతీశ్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెలు సాంస్కృతిక కళలకు నిలయాలు

కాల్వశ్రీరాంపూర్: పల్లెలు సాంస్కృతిక చారిత్రక కళలకు నిలయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని వెన్నంపల్లిలో మూడు రోజులుగా చిడుతల రామాయణం కళాప్రదర్శనలో సోమవారం శ్రీరామపట్టాభిషేకం కన్నుల పండువగా జరిపించారు. ఎమ్మెల్యే హాజరై కళాకారులను అభినందించారు. పలువురు నేతలు, వివిధ గ్రామాల ప్రజలు పట్టాభిషేక ఘట్టం తిలకించారు. మహిళలు స్వామి వారలకు ఒడిబియ్యం, సారెచీర, కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ జట్టి దేవేందర్, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

జూలపల్లి వాసికి జాతీయ స్థాయి అవార్డు

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కోడూరి మహేశ్ జాతీయ స్థాయి మహానంది అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డును తెలుగు,వెలుగు స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో త్యాగరాయ గాన సభ కళా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు గ్రహీత శ్రీ శాంతికృష్ణ, ఐఎస్ఎఫ్ అధికారి గామినేని రామలింగం చేతుల మీదుగా మహేశ్‌కు అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి అవార్డు అందజేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహావిష్కరణను అడ్డుకుంటాం

మంథని: మండలంలోని సూరయ్యపల్లి క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణను అడ్డుకుంటామని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా అధికార పార్టీ నాయకుడు ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదన్నారు. గ్రామస్తులంతా కలిసి అంబేడ్కర్ విగ్రహం నెలకొల్పాలని అనుకుంటే అనుమతి లేకుండా మరో విగ్రహం ఏర్పాటు చేయడం అవమాన పర్చడమే అన్నారు. ఇక్కడ ఎలాంటి విగ్రహాలు పెట్టవద్దని పోలీసులు పలువుర్ని బైండోవర్ చేసిన అధికారుల అలసత్వం ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. విగ్రహం వద్దని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. విగ్రహావిష్కరణ అడ్డగింతలో ఏ ఒక్కరికి హాని జరిగినా అధికారులే బాధ్యత వహించాలని గ్రామస్తులు జంజర్ల మల్లేశ్, ఆర్ల నాగరాజు, దేవేందర్ అన్నారు.

కంటి ఆస్పత్రి ప్రారంభానికి ఆహ్వానం

సుల్తానాబాద్: ఈ నెల 10వ తేదీన కంటి ఆస్పత్రి బసంత్ నగర్‌లో ప్రారంభానికి అందరూ ఆహ్వానితులేనని మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు అన్నారు. సోమవారం పట్టణంలోని స్వగృహంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఆలయ ఫౌండేషన్, మధ్యప్రదేశ్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయిరి మహేందర్, బొల్లి నగేష్ , అడిచెర్ల స్వతంత్ర కుమార్, తిట్ల రమేష్ బాబు పాల్గొన్నారు.

గోదాం అధికారిగా మహేశ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఎంఎల్ఎస్ గోదాం అధికారిగా మహేశ్ బాధ్యతలు స్వీకరించారు. గోదాంలో పనిచేస్తున్న వెంకట రాజంను ఇటీవల కలెక్టర్ సస్పెండ్ చేశారు. సింగరేణి భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్ మహేశ్‌ను గోదాం అధికారిగా నియమించగా, సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులకు లయన్స్ క్లబ్ ఎలైట్ సెక్రటరీ సతీశ్ రెడ్డి తన తండ్రి గోపిరెడ్డి జ్ఞాపకార్థం సోమవారం రూ.50 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు లక్ష్మయ్య, ప్రబంధక్ కమిటీ సభ్యులు శశాంక, రాజ్‌గోపాల్, వెంకటేశం, హన్మంతరావు, మల్లారెడ్డి తదితరులున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కమిటీ ఏకగ్రీవం

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లల కనకరాజు, ఉపాధ్యక్షులుగా సీపెల్లి శ్రావణి, సీపెల్లి అంజయ్య, గొడిసెల ధర్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా సీపెల్లి సూర్యనారాయణ, అంరాజీ స్వామి, కార్యదర్శులుగా కాంపెల్లి చెంద్రయ్య,నల్లాల శంకర్, రవి, శ్రీనివాస్ కోశాధికారిగా గొడిసెల నర్సయ్య,సంబోజి శంకరయ్య,ప్రచార కార్యదర్శులుగా నల్లల సత్యనారాయణ, రాజయ్య,కమలాకర్, శంకరమ్మ ఎన్నికయ్యారు.

అసెంబ్లీ కన్వీనర్‌గా పిడుగు కృష్ణ

గోదావరిఖని: బీజేపీ రామగుండం నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్‌గా పిడుగు కృష్ణను నియమించారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కృష్ణను పలువురు సన్మానించారు. సమావేశంలో నాయకులు దుబాసి లలిత, మండల కిషన్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, మిట్టపల్లి సతీష్, డేవిడ్ రాజ్, రాజలింగు, బద్రి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తైబజారు వేలం పాట

కమాన్‌పూర్: మండల కేంద్రంలో నిర్వహించే తైబజారు వేలంను మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు సర్పంచ్ నీలం సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజారు వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

5న పుట్ట నారాయణ వర్ధంతి

గోదావరిఖనిటౌన్: సింగరేణి కార్మికుడు,1978లో రమేజాబీపై అత్యాచారం చేసి ఆమె భర్తను హత్య చేసిన ఘటనకు నిరసన చేస్తూ పోలీసుల కాల్పుల్లో అమరుడైన పుట్ట నారాయణ 45వ వర్ధంతిని గోదావరిఖని మార్కండేయకాలనీలోని స్నేహసాహితి గ్రంథాలయంలో ఈనెల 5న నిర్వహించనున్నట్లు పుట్ట రాజన్న,కుటుంబ సభ్యులు తెలిపారు.

అధికారి మారినా... బోర్డు మారలే!



బోర్డుపై పేరు మార్చని అధికారులు

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో సమాచార హక్కు చట్టం బోర్డును ఆస్పత్రి అధికారులు మొక్కుబడిగా ఏర్పాటు చేసినట్లు స్పష్టమవుతోంది. సమాచార హక్కు చట్టంపై అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో ఈ బోర్డును పరిశీలిస్తే అర్థమవుతుంది. బోర్డులో పేర్కొన్న అధికారుల వివరాలను పరిశీలిస్తే... ప్రజా సమాచార అధికారి(పీఐఓ)గా డాక్టర్ ఏ.భీష్మాచారి వ్యవహరిస్తున్నట్లుగా ఉండగా, సదరు అధికారి 45 రోజుల క్రితమే బదిలీ అయ్యారు. సహాయ ప్రజా సమాచార అధికారిగా ఎవరు వ్యవహరిస్తున్నారనే విషయమై స్పష్టత లేదు. దీనిపై అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డుపై విధుల్లో ఉన్న వారి పేర్లను రాయాలని ప్రజలు కోరుతున్నారు.

అవినీతి పాలకవర్గాన్ని రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో వాహనాల కొనుగోలులో జరిగిన అవకతవకలపై విచారణ కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య మాట్లాడుతూ రామగుండం స్వచ్ఛతకు రూ.ఏడు కోట్ల నిధులతో వాహనాలను కొనుగోలు చేయడానికి తీర్మానం చేసి బిల్లులు చెల్లించి ఏడాది గడిచినప్పటికీ జాబ్‌కార్డు మిషన్, ఎక్స్‌కవేటర్ మిషన్లు నగరపాలక సంస్థకు చేరలేదని ఆరోపించారు. వాహనాలు అందుబాటులో లేక నగరంలో శానిటేషన్ పనుల కోసం లక్షలాది రూపాయలు కాంట్రాక్టర్లకు ఖర్చుపెట్టి పనులు చేయించుకోవాల్సిన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాలు పూర్తి అవినీతిలో కూరుకుపోయాయని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అవినీతి పాలకవర్గాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామగుండం నగర అధ్యక్ష, కార్యదర్శులు సాదుల శివకుమార్, ఆసాల నవీన్‌కుమార్, సుధీర్ కుమార్, గోపికృష్ణ, మహ్మద్ కరీం, వినయ్, అంజి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



జూలపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని గోకుల్ నగర్‌లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు నరిగే మల్లేష్, కోరే బీరయ్య, కొమ్ము చేరాలు, సాయిలు, సురేశ్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు అబ్బాపూర్‌లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అబ్బాపూర్‌లో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. జూలపల్లిలో కురుమ యువసేన మండల అధ్యక్షుడు గుంటి శంకర్ అధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, యువజన సంఘాల అధ్యక్షుడు అమరగాని ప్రదీప్ కుమార్, శ్రీనివాస్, యువసేన నాయకులు పాల్గొన్నారు.

మంథని: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ తొలి రైతాంగ అమరువీరుడు దొడ్డి కొంరయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. కళాశాలలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భరత్ మాట్లాడుతూ కొంరయ్య ప్రాణ త్యాగం నాటి నిజాం నిరంకుశ పాలనకు, జమీందారు, అరాచ పాలనకు వ్యతిరేఖంగా సాయుత పోరాటానికి నాంది పలికిందన్నారు. అకడమిక్ కో–ఆర్డినేటర్ కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్/ జూలపల్లి/ రామగిరి/కమాన్‌పూర్/ పాలకుర్తి/ ఓదెల/ గోదావరిఖనిటౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, సీసీ కెమెరాలు, ఏఎన్ఎమ్, ఆశావర్కర్లు, తదితర సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారు. పలు పరీక్ష కేంద్రాలను డీఈవో మాధవి, అధికారులు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

జిల్లాకేంద్రంలో శాశ్వత గోదాం నిర్మించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో శాశ్వత గోదాం నిర్మించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి సునీల్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాయలంలో డీటీ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందించారు. ప్రజాపంపిణీ వ్యవస్థకు సరుకుల ఎగుమతి, దిగుమతికి ఇబ్బంది కలుగుతోందని, శాశ్వత గోదాం నిర్మించి సమస్య పరిష్కరించాలని పేర్కొన్నారు. నాయకులు తిరుపతి, సతీష్, పోచమల్లు, ఓదెలు, నరేశ్, మల్లయ్య తదితరులున్నారు.

మహనీయుల ఉత్సవ కమిటీలు వేయాలి

పెద్దపల్లిరూరల్: బాబుజగ్జీవన్‌రాం, అంబేడ్కర్ జయంతి సందర్భంగా కమిటీలను ఏర్పాటు చేయాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ నారాయణకు వినతిపత్రం అందించినట్లు నాయకులు అశోక్, మామిడిపల్లి బాపయ్య తెలిపారు. దళితసంఘాల నాయకులను సంప్రదించి కమిటీలను ఖరారు చేయాలని కోరారు.